సాక్షి
వికారాబాద్
సోమవారం, 14, అక్టోబర్, 2024


తాండూరు: రావణ దహనాన్ని వీక్షిస్తున్న ప్రజలు


ధారూరు: రాజరాజేశ్వరీదేవి అలంకరణలో అమ్మవారు


తాండూరు: ప్రజలకు పాలపిట్ట దర్శనం కల్పిస్తున్న నేతలు


అనంతగిరి: దసరా సంబరాల్లో పాల్గొన్న జనం


దౌల్తాబాద్‌లో శమీపూజకు హాజరైన భక్తులు

దసరా సందడి

దసరా వేడుకలు అంబరాన్నంటాయి. శనివారం జిల్లాలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దుర్గామాతకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆదివారం శమీపూజ, పాలపిట్టను దర్శనం చేసుకున్నారు. వికారాబాద్, తాండూరు పట్టణాల్లో రావణ దహనం అట్టహాసంగా సాగింది. వేలాది మంది భక్తులు ఈ కార్యక్రమాన్ని తిలకించారు.

న్యూస్‌రీల్

బుగ్గలో ప్రత్యేక పూజలు


స్వామివారి సన్నిధిలో మహేందర్‌రెడ్డి

అనంతగిరి: వికారాబాద్ సమీపంలోని బుగ్గ రామలింగేశ్వర స్వామిని శనివారం శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందజేశారు.

నిమజ్జనానికి వెళ్లి నీటమునిగి కూలీ మృతి



బషీరాబాద్: పండుగ పూట ఓ పేదింట విషాదం నెలకొంది. దుర్గామాత నిమజ్జనానికి గ్రామస్తులతో కలిసి చెరువు వద్దకు వెళిన వ్యక్తి నీట మునిగి మృతి చెందాడు. ఈ ఘటన బషీరాబాద్ మండలం రెడ్డి ఘణాపూర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, ఎస్‌ఐ గఫార్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన వెన్నచెడ్ అశోక్(38) వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం దుర్గామాత విగ్రహాన్ని ఎల్లమ్మ చెరువులో నిమజ్జనం చేయడానికి గ్రామస్తులతో కలిసి వెళ్లాడు. నిమజ్జన అనంతరం స్థానికులతో కలిసి అశోక్ చెరువులో స్నానం చేయడానికి దిగాడు. ఈ క్రమంలో బురదలో ఇరుక్కుపోయాడు. అశోక్ కనిపించకపోవడంతో గ్రామస్తులు నీటిలో వెతికారు. ఆచూకీ లభించలేదు. దీంతో పక్కగ్రామం మల్కాన్‌గిరికి చెందిన రవీందర్, రంగప్ప, క్రాంతి, శేఖర్, రవిను రప్పించి నీటిలో వెతికించారు. నీటి అడుగున బురదలో ఇరుకున్న అశోక్‌ను గుర్తించి మృతదేహాన్ని బయటికి తీశారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

చిలుకూరు సన్నిధిలో మేఘాలయ గవర్నర్



మొయినాబాద్: మేఘాలయ గవర్నర్ విజయ్ శంకర్ చిలుకూరు బాలాజీని దర్శించుకున్నారు. శనివారం దసరా పండుగ రోజు చిలుకూరు బాలాజీ ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అర్చకుడు రంగరాజన్ స్వాగతం పలికారు. గవర్నర్ ఆలయ గర్భగుడిలోకి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో సుందరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిలుకూరు బాలాజీ దేవాలయ విశిష్టతను అర్చకుడు రంగరాజన్ ఆయనకు వివరించారు. స్వామివారి వస్త్రాలను అందజేసి ఆశీర్వదించారు.

పండుగ ముగిసింది.. రద్దీ పెరిగింది

షాద్‌నగర్: దసరా పండుగ ముగియడంతో పల్లెలకు వచ్చిన వారంతా పట్నానికి తిరుగు పయనమయ్యారు. దీంతో హైదరాబాద్ - బెంగళూరు 44వ నంబర్ జాతీయ రహదారి వాహనాలతో కిక్కిరిసిపోయింది. దసరా సెలవుల నేపథ్యంలో హైదరాబాద్ నుంచి చాలామంది స్వగ్రామాలకు వెళ్లారు. మళ్లీ అందరూ సిటీ బాట పట్టడంతో ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి ట్రాఫిక్ రద్దీ పెరిగింది. షాద్‌నగర్ పరిధిలోని రాయికల్ టోల్‌ప్లాజా వద్ద భారీగా వాహనాలు క్యూ కట్టాయి.

వరాలు కురిపించేనా?

రేపు జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి

- నేవీ రాడార్ స్టేషన్ భూమిపూజలో పాల్గొననున్న ముఖ్యమంత్రి
- గెలిచాక మొదటిసారి పరిగి నియోజకవర్గంలో పర్యటన
- అభివృద్ధి పనులన్నీ సొంత నియోజకవర్గంలోనే..
- జిల్లా ఎమ్మెల్యేలపై పెరుగుతున్న ఒత్తిడి
- జిల్లాకు సీఎం చేసిందేమీ లేదంటున్న ప్రతిపక్షాలు

వికారాబాద్: సీఎంగా బాధ్యతలు చేపట్టాక సొంత నియోజకవర్గ పర్యటనకే పరిమితమైన రేవంత్‌రెడ్డి మొదటి సారి కొడంగలేతర నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. ఈ నెల 15న పరిగి నియోజకవర్గం దామగుండం అటవీ ప్రాంతంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో కలిసి నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు భూమిపూజ చేయనున్నారు. సీఎం సొంత నియోజకవర్గ అభివృద్ధి కోసం కడా (కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) ఏర్పాటు చేసి రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్న నేపథ్యంలో జిల్లాలోని ఇతర నియోజకవర్గాల్లో కూడా అదే తరహా అభివృద్ధి చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. అభివృద్ధి ఒకే ప్రాంతానికి పరిమితం చేశారని ప్రతిపక్ష నేతలు విమర్శిస్తున్నారు. సీఎం జిల్లా అభివృద్ధికి ఆమడదూరంలో ఉందని మండిపడుతున్నారు.

కొడంగల్ తరహాలో..

వికారాబాద్, పరిగి, తాండూరు నియోజకవర్గాలను కొడంగల్ తరహాలో అభివృద్ధి చేయాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. అభివృద్ధి కొడంగల్‌కే పరిమితం కావడం జిల్లా ప్రజలను అసంతృప్తికి గురిచేస్తోంది. జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యేలు టీ రామ్మోహన్‌రెడ్డి, బీ మనోహర్‌రెడ్డి సైతం తమ నియోజకవర్గాల అభివృద్ధి విషయంలో సీఎంను ఒప్పించడంలో సఫలం కాలేకపోతున్నారనే వాదన వినిపిస్తోంది. కొడంగల్ అభివృద్ధికి రూ.5 వేల కోట్లు వెచ్చిస్తున్న ముఖ్యమంత్రి జిల్లాలోని ఇతర నియోజకవర్గాలకు కనీసం రూ.100 కోట్లు కూడా ఇవ్వడం లేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.


నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాట్లను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

పూడూరు: మండలంలోని దామగుండం అటవీ ప్రాంతంలో నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటు పనులను ఆదివారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి నేవీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాడార్ స్టేషన్ ఏర్పాటైతే ఈ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. రోడ్లు, రవాణా వ్యవస్థ మెరుగుపడటంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

ప్రజలు ఆశిస్తున్న పనులివే..

జిల్లా అభివృద్ధిపై సీఎం దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. అప్పా జంక్షన్ నుంచి చేవెళ్ల, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల మీదుగా హైవే అభివృద్ధి, మహబూబ్‌నగర్ నుంచి పరిగి నియోజకవర్గం గండేడ్, కొడంగల్, తాండూరు నియోజకవర్గాల మీదుగా చించోలి వరకు మరో హైవే పనులు పూర్తి చేయటం, మన్నెగూడ నుంచి వికారాబాద్.. అనంతగిరి మీదుగా తాండూరు వరకు నాలుగు లేన్ల రహదారిగా అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్ర రాజధానికి కనెక్టివిటీ కూడా పెరగనుంది. ఇదే సమయంలో షాద్‌నగర్ - పరిగి నాలుగు లేన్ల రహదారిగా అభివృద్ధి చేయడంతో పాటు శంకర్‌పల్లి నుంచి మోమిన్‌పేట మీదుగా మర్పల్లి వరకు రహదారి అభివృద్ధి చేయడం ద్వారా జిల్లా నలుమూలలకు నగరం నుంచి కనెక్టివిటీ పెరిగి అభివృద్ధికి మరింత ఊతమిచ్చేందుకు దోహదం చేయనుందని జిల్లా ప్రజలు భావిస్తున్నారు. జిల్లా మీదుగా రీజనల్ రింగ్‌రోడ్డు కూడా వెళ్లనుండటంతో ఆ చుట్టు పక్కల వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టుల ఏర్పాటు, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు లాంటి ప్రతిపాదనలు జిల్లా ప్రజలను ఊరిస్తున్నాయి. అనంతగిరిని టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయడం, మోమిన్‌పేటలో మొబిలిటి వ్యాలి, నవాబుపేట మండలం ఆర్కతల పరిసరాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు లాంటి పనులకు ఇప్పటికే పునాదులు ప డ్డాయి. ఈ పనులన్నింటినీ పరుగులు పెట్టించటం ద్వారా జిల్లా రూపు రేఖలు మారుతాయని జిల్లా వాసులు ఆశిస్తున్నారు. వీటితో పాటు అస్తవ్యస్తంగా ఉన్న నాలుగు మున్సిపాలిటీల్లో అంతర్గత రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. మున్సిపాలిటీల చుట్టూ రింగు రోడ్లు ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

విలువలతో కూడిన రాజకీయాలే చేశా

- గత పాలకులు తాండూరు అభివృద్ధిని విస్మరించారు
- తొమ్మిది నెలల మా పాలనలో అనేక పనులు చేపట్టాం
- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: గత పాలకులు పదవులను అడ్డం పెట్టుకొని అక్రమ వసూళ్లకు, కమీషన్లకు పాల్పడి హైదరాబాద్‌లో ఎంజాయ్ చేశారని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాండూరులో ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని బీఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ట్రాక్టర్‌కు రూ.600 చెల్లించిన తర్వాతే కాగ్నానది నుంచి ఇసుక తరలింపునకు అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. 9 నెలల వ్యవధిలో ఇసుక రవాణా ద్వారా కలెక్టర్ ఖాతాలోకి రూ.1.50 కోట్లు జమ అయినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఇంత పెద్ద మొత్తంలో ఇసుక ద్వారా ఆదాయం సమకూరిన దాఖలాలు లేవన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ఇసుక అక్రమ రవాణా జరిగిందని.. ఇప్పుడు కూడా అదే భ్రమలో ఉన్నారని ఎద్దేవా చేశారు. తాను అక్రమ వ్యాపారాలను ఎప్పుడూ ప్రోత్సహించనన్నారు. విలువలతో కూడిన రాజకీయం చేస్తానని పేర్కొన్నారు. తనకు వ్యాపారాలు ఉన్నాయి.. ఆర్థికంగా బాగానే ఉన్నా.. అక్రమంగా డబ్బు తీసుకోవడం నా రాజకీయ చరిత్రలోనే లేదన్నారు. 30 ఏళ్ల నుంచి రాజకీయాల్లో ఉన్నా.. జెడ్పీటీసీగా, డీసీసీబీ చైర్మన్‌గా.. ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్నాను.. ఏ స్థాయిలో ఉన్నా పారదర్శకంగా పని చేశానని అన్నారు. గత పాలకులు పదవులను అడ్డం పెట్టుకొని తాండూరును అభివృద్ధి చేయకుండా సర్వనాశనం చేశారని ఆరోపించారు. తాండూరు రోడ్లపై బీఆర్‌ఎస్ నేతలు ఆరోపణలు చేయడం అర్థరహితమన్నారు. పదేళ్ల వారి పాలనలో రోడ్లు వేయలేదన్నారు. కమీషన్ల కోసం పనులను అడ్డుకున్నారని ఆరోపించారు. గతంలో చేసిన పనులకు రూ.50 కోట్లు కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. పదేళ్లుగా తాండూరు – హైదరాబాద్ రోడ్డును ఎందుకు పట్టించుకోలేదో సమాధానం చెప్పాలన్నారు. జినుగుర్తిలో పారిశ్రామిక వాడ, తాండూరులో లారీ పార్కింగ్, చిలుక వాగు ప్రక్షాళన పనులను గత పాలకులు గాలికి వదిలేశారని, తాను ఎమ్మెల్యే అయ్యాక నిర్మాణ పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. కర్ణాటక సరిహద్దులో ఉన్న మైల్వార్ – నీళ్లపల్లి అటవీ ప్రాంతంలో 30 ఏళ్లుగా కబ్జాకు గురైన అటవీ భూములను విడిపించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. తాను ప్రత్యేక చొరవ తీసుకొని అటవీ శాఖ మంత్రితో మాట్లాడి ఇరు రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సంయుక్త సర్వే చేయించడం జరిగిందన్నారు. ఈ సర్వేతో 700 ఎకరాలకు పైగా కబ్జాకు గురైన అటవీ భూములను మన ఆధీనంలోకి వస్తున్నాయని తెలిపారు. పాత తాండూరు రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి కోసం మూడు సార్లు శిలా ఫలకాలు వేశారు. కానీ పనులు ప్రారంభించలేదు. తాను ఎమ్మెల్యే అయిన వెంటనే భూమిపూజ చేసి పనులు మొదలు పెట్టడం జరిగిందన్నారు. త్వరలో ఈఎస్‌ఐ ఆసుపత్రిని అందుబాటులోకి తెస్తామన్నారు. పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల కమిటీలు వేస్తామని తెలిపారు. వచ్చే నెలలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను పేదలకు పంపిణీ చేస్తామని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ సహకారంతో తాండూరు అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకొస్తామని హామీ ఇచ్చారు.

తెగ తాగేశారు

- దసరా పండుగ వేళ మద్యం కిక్కు
- రూ.312 కోట్లకుపైగా విక్రయాలు
- సర్కారు ఖజానాకు భారీగా రాబడి
- గత ఏడాదితో పోలిస్తే కొంత తగ్గుముఖం



సాక్షి, రంగారెడ్డి జిల్లా: దసరా పండుగ వేళ మద్యం ×కిక్కు₹ పెంచింది. హైదరాబాద్ సహా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో విక్రయాలు ప్రభుత్వానికి భారీ ఆదాయాన్ని సమకూర్చాయి. గత ఏడాది అక్టోబర్ 1 నుంచి 10వ తేదీతో పోలిస్తే ఈ ఏడాది ఇదే సమయంలో (పది రోజుల్లో) అమ్మకాలు కొంత తగ్గుముఖం పట్టాయి. రియల్ ఎస్టేట్ పడిపోవడం, మూసీ ముంపు బాధితుల్లో దసరా సంబురాలు తగ్గాయి. హైడ్రా కూల్చివేతలతో మెజారిటీ అపార్ట్‌మెంట్లలో ప్లాట్లు, ఖాళీ స్థలాల అమ్మకాలు నిలిచిపోయాయి. రిజిస్ట్రేషన్లు కాకపోవడం, మార్కెట్లో పెద్దగా ఆర్థిక లావాదేవీలు లేకపోవడం, నిత్యావసరాల ధరలు అమాంతం పెరగడం మద్యం అమ్మకాల తగ్గుదలకు మరో కారణమని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. గ్రేటర్‌లోని హైదరాబాద్, సికింద్రాబాద్, మేడ్చల్, మల్కాజిగిరి, వికారాబాద్, శంషాబాద్, సరూర్‌నగర్ ఎక్సైజ్ జిల్లాల పరిధిలో 674 మద్యం దుకాణాలు ఉండగా, గత ఏడాది మద్యం అమ్మకాల ద్వారా రూ.317.23 కోట్ల ఆదాయం వచ్చింది. ప్రస్తుతం రూ.312.05 కోట్లే సమకూరింది. గతంతో పోలిస్తే.. ఎక్సైజ్ ఆదాయం పెరగక పోగా.. రూ.5.18 కోట్ల మేర ఆదాయం తగ్గడం గమనార్హం. గతంతో పోలిస్తే.. మద్యంప్రియుల సంఖ్య కూడా క్రమంగా తగ్గుముఖం పడుతోంది. ఏళ్లుగా మద్యం అలవాటు ఉన్న వాళ్లను ఆరోగ్య సమస్యలు వెంటాడుతుండటంతో మెజారిటీ మద్యం ప్రియులు లిక్కర్‌కు దూరంగా ఉంటున్నారు.

పది రోజుల్లో మద్యం విక్రయాలు (రూ.కోట్లలో)

ఎక్సైజ్‌జిల్లా	షాపులు	2023	2024
హైదరాబాద్	80	45.56	38.50
సికింద్రాబాద్	99	38.02	35.87
మేడ్చల్	114	52.69	55.53
మల్కాజ్‌గిరి	88	45.94	45.50
వికారాబాద్	59	15.98	17.25
శంషాబాద్	100	61.31	59.64
సరూర్‌నగర్	134	57.73	60.55

విద్యుత్ తీగల చోరీ

పోలీసులకు ఫిర్యాదు

నందిగామ: పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో గ్రామ సమీపంలోని ఓ వెంచర్‌లో 17 స్తంభాలకు చెందిన విద్యుత్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిపోయారు. ఈ ఘటన నందిగామలో చోటు చేసుకుంది. స్థానికులు, వెంచర్ నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం.. నందిగామ గ్రామ సమీపంలో వీర్లపల్లికి వెళ్లే దారిలో వేణుగోపాల్ నగర్ వెంచర్ ఉంది. ఆ వెంచర్‌లో శనివారం అర్ధ రాత్రి గుర్తుతెలియని దుండగులు ప్రవేశించి 17 స్తంభాలకు ఉన్న విద్యుత్ వైర్లను కోసుకొని వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం కాపాలదారుడు శ్రావణ్ కుమార్ విషయాన్ని గుర్తించాడు. విద్యుత్ వైర్ల విలువ సుమారు రూ. లక్షల్లో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఇద్దరు దుండగులు విద్యుత్ వైర్లను కట్ చేసేందుకు వచ్చినట్లు అక్కడ ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డ్ అయ్యింది. శ్రావణ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అశ్వ వాహనంపై అనంతుడు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం ఆలంపల్లిలో వెలసిన శ్రీ లక్ష్మీ అనంతపద్మనాభ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారు అశ్వ వాహనంపై ఊరేగారు. ఉదయం స్వామివారికి స్పీకర్ ప్రసాద్‌కుమార్ పట్టువస్త్రాలు సమర్పించారు. అశ్వవాహన వేడుక ఆలంపల్లి ప్రధాన వీధుల మీదుగా సమీప మైదానం వరకు సాగింది. అక్కడ రావణ దహనం, జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్ రెడ్డి, మాజీ చైర్మన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

దస్తగిరిపేట్‌లో..

తాండూరు రూరల్: మండలంలోని దస్తగిరిపేట్(చంద్రగిరి) వేంకటేశ్వర స్వామి ఆలయంలో దసరా పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం స్వామివారు అశ్వవాహనంపై విహరించారు. కార్యక్రమంలో ఆయల ధర్మకర్తలు పూరంధరచార్ శుక్రవార్, భక్తులు పాల్గొన్నారు.

కొడంగల్‌లో..

కొడంగల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన కొడంగల్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి శనివారం సాయంత్రం అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. కలియుగాంతంలో శ్రీనివాసుడు అశ్వవాహనంపై వచ్చి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేస్తాడని చాటిచెప్పడమే ఈ వాహనం పరమార్థమని అర్చకులు తెలిపారు. దేవేరుల సమేత మలయప్పస్వామి అశ్వవాహనంపై పారువేటకు బయలుదేరి బస్టాండ్ సమీపంలోని శాంతినగర్ కాలనీలో భక్తులతో పూజలు అందుకున్నారు. ఆలయ ఆవరణలో జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు.


అనంతగిరి: స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్


తాండూరు రూరల్: శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి


కొడంగల్: అశ్వవాహనంపై శ్రీవారు

క్లుప్తంగా

డీఎస్సీ అభ్యర్థికి ఘన సన్మానం



నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

దోమ: డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్‌లో బయోలజీ సైన్స్ ఉద్యోగం సాధించిన నర్సింహారెడ్డిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఆదివారం మండల పరిధి అనంతరెడ్డి పల్లి గ్రామంలో.. జిల్లాలో 22వ ర్యాంకులో ఉద్యోగం సాధించిన నర్సింహరెడ్డికి, ఆయన కుటుంబానికి శాలువాలు కప్పి, పూలమాలతో సన్మానించారు. వ్యవసాయమే ఆధారంగా జీవనం సాగించిన నర్సింహరెడ్డి.. ఉద్యోగం కోసం ఎంతో శ్రమించారని స్థానికులు గుర్తు చేశారు. ఆయనను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

నూతన ఉపాధ్యాయులకు సన్మానం



టీచర్లను సన్మానిస్తున్న ఉద్యోగ బృందం

యాలాల: నూతన ఉపాధ్యాయులను ఆదివారం మండల కేంద్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించింది. మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్, హరీశ్, భరత్‌లు ఇటీవల నిర్వహించిన డీఎస్సీ2024లో అర్హత పొందారు. వీరిని గ్రామానికి చెందిన సీనియర్ ఉపాధ్యాయుడు యూసుఫ్, జీహెచ్ఎం దూస రాములు తదితరుల సమక్షంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరేశం, ప్రభాకర్‌చారి, బస్వరాజ్, మహేశ్, నర్సింహులు, నరేష్, భరత్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

ఈ కుబేర్ విధానం వద్దు

కొడంగల్: ఈ కుబేర్ విధానం రద్దు చేసి, వెంటనే పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని రిటైర్డ్ ఉద్యోగులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పెన్షనర్స్‌కు రావాలసిన గ్రాట్యుటీ, కమ్యుటేషన్, ఈఎల్స్, జీపీఎస్, మెడికల్ బిల్లులు తదితర వాటిని చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీసీ వసతి గృహం విశ్రాంత సంక్షేమాధికారి (హాస్టల్ వార్డెన్) రాములు, విశ్రాంత ఉద్యోగులు పాపిరెడ్డి, ఆశప్ప, వడ్ల గోపాల్, రాములు, బాకారం మల్లయ్య, హకీం బాలరాజు, మొగులప్ప తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలు

పరిగి: బైక్ అదుపుతప్పి వ్యక్తి గాయపడ్డాడు. ఈ సంఘటన జాపర్‌పల్లి గ్రామ శివారు గూడూరు గేట్ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాపోల్ గ్రామానికి చెందిన తిరుపతి.. రాఘవపూర్‌కు వచ్చి బైక్‌పై తిరిగి వెళ్తుండగా, మార్గమధ్యలో జాపర్‌పల్లి శివారులో బైక్ అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు.. క్షతగాత్రున్ని వెంటనే చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కుటుంబీకులు వికారాబాద్‌కు తరలించారు.

మద్యం మత్తులో భార్యపై కత్తితో దాడి

మొయినాబాద్: మద్యం మత్తులో భార్యపై కత్తితో దాడి చేసిన సంఘటన మొయినాబాద్ మండల పరిధిలోని చందానగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చందానగర్ గ్రామానికి చెందిన ఎస్‌కే బాబుజాన్ కుటుంబ సమస్యలతో తరచూ భార్య రిజ్వానతో గొడవ పడేవాడు. శనివారం రాత్రి బాబుజాన్ రోజుమాదిరిగా మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడ్డాడు. మద్యం మత్తులో ఆయన ఇంట్లో ఉన్న కూరగాయల కత్తితో వీపులో పొడిచి గాయపరిచాడు. విషయం తెలుసుకున్న చుట్టుపక్కలవారు వచ్చి విడిపించి, పోలీసులకు సమాచారం చేరవేశారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని గాయాలైన రిజ్వానాను చికిత్సకోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం నిందితునిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వికారాబాద్‌పై చిన్నచూపు తగదు

- సొంత నియోజకవర్గానికే నిధులా?
- రూ.వెయ్యి కోట్ల చొప్పున మిగతా అసెంబ్లీ సెగ్మెంట్లకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శుభప్రద్‌పటేల్ డిమాండ్



మాట్లాడుతున్న శుభప్రద్‌పటేల్

అనంతగిరి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సొంత నియోజకవర్గానికి రూ.5 వేల కోట్లు నిధులు కేటాయించి, జిల్లా కేంద్రమైన వికారాబాద్‌కు ఇప్పటి వరకు ఎలాంటి నిధులు ఇవ్వలేదని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శుభప్రద్ పటేల్ ఆరోపించారు. నియోజవర్గాన్ని ఎందుకు చిన్నచూపు చూపుతున్నారని ప్రశ్నించారు. ఆదివారం వికారాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో వెనుకబడిన జిల్లా మనదేనని చెప్పారు. జిల్లా పర్యటనకు రానున్న సీఎం.. వికారాబాద్, పరిగి, తాండూరు నియోజకవర్గాలకు రూ.వెయ్యి కోట్ల చొప్పున ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాకు ఒకటి చొప్పున వచ్చిన ఇంటిగ్రేటెడ్ గురుకులం సైతం కొడంగల్‌కు తరలించడం ఎంతవరకు సమంజసమన్నారు. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు ఫోర్ వే పనులు మంజూరయినా.. ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదని పేర్కొన్నారు. వికారాబాద్‌కు వెంటనే రింగ్‌రోడ్డుతో పాటు, గ్రామీణ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిపై ఒత్తిడి తెచ్చి, జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. లేని యెడలా ఈ ప్రాంత ప్రజల కోసం పోరాటం చేయడానికి సిద్ధమని వెల్లడించారు. ఇప్పటికైనా సీఎం జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. దామగుండం నేవిరాడార్‌ను మరో ప్రాంతానికి మార్చాలని కోరారు. రాష్ట్ర నాయకుడు బి.కృష్ణయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం 6గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు అయినా మహిళలకు రూ.2500 పథకం అమలు చేయలేకపోయారన్నారు. పింఛన్లు పెంచుతామని చెప్పి పెంచలేదన్నారు. కల్యాణ లక్ష్మికి అదనంగా తులం బంగారం ఏమయిందని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అప్పా విజయ్‌కుమార్, చైతన్య, రవిశంకర్, సురేష్, శాంతకుమార్, సిద్ధిఖీ, కేదర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.





తాండూరు: సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, టీఆర్ఆర్ తదితరులు

సీఎంకు ఎమ్మెల్యేల దసరా శుభాకాంక్షలు

తాండూరు/పరిగి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం కొడంగల్‌కు సీఎం వచ్చిన సందర్భంగా.. ఆయనను ఎమ్మెల్యేలతో పాటు, పలువురు కాంగ్రెస్ తాండూరు, పరిగి నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో ఎమ్మెల్యే సోదరుడు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు. ఎమ్మెల్యే టీఆర్ఆర్ వెంట డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్ ఉన్నారు.

ఫార్మా కంపెనీలను అడ్డుకుంటాం

- రైతులకు అన్యాయం జరిగితే ఊరుకోం
- మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్: నియోజవర్గంలోని హకీంపేట, పోలేపల్లి, లగచర్ల గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేయాలనుకుంటున్న ఫార్మాకంపెనీలను అడ్డుకుంటామని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొడంగల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రైతుల భూములను లాక్కొని, ఫార్మా కంపెనీలకు కట్టబెట్టడానికి ప్రయత్నిస్తుందని ఆరోపించారు. రైతులకు అన్యాయం జరిగితే తామూ చూస్తూ ఊరుకోమని, వారి తరఫున బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి సొంత గ్రామం కొండారెడ్డిపల్లిపై ఉన్న ప్రేమ, ఓట్లేసి గెలిపించిన కొడంగల్‌పై లేదని విమర్శించారు. సోలార్ పవర్ ప్రాజెక్టును నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ ముఖ్యమంత్రి అయితే ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ప్రజలు భావించి గెలిపించారని, కానీ వారి ఆశలను అడియాశలు చేస్తూ రైతులను, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఫార్మా కంపెనీల వలన కాలుష్యం పెరుగుతుందని, తద్వారా నీరు, వాతావరణం కలుషితం అయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. భవిష్యత్తులో తాగడానికి నీరు దొరకని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. టెక్స్‌టైల్ కంపెనీలు పెడితే, ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. అర్హులైన రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయలేదన్నారు. దీపావళి లోపు అర్హులందరికీ రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రెండో వార్డు కౌన్సిలర్ మధుయాదవ్, మాజీ సర్పంచ్ రమేష్‌బాబు, నవాజొద్దీన్, బిచ్చప్ప, మధు తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



నవాబుపేట: ఎద్దు కళేబరం

నవాబుపేట: విద్యుదాఘాతంతో ఓ ఎద్దు మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి వెళ్లకుండా గ్రామానికి రామచంద్రయ్య.. ఎప్పటి లాగానే తన రెండు ఎడ్లను ఆదివారం మేతకు వదిలారు. ఈ క్రమంలో అవి మేత మేసుకుంటా పక్కనే ఉన్న విద్యుత్ టాన్స్‌ఫార్మర్‌కు ఓ ఎద్దు తగిలింది. దీంతో కరెంట్ షాక్‌కు గురై అది అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో బాధిత రైతు బోరున విలపించాడు. ఎద్దు విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని, జీవనాధారం కోల్పోయిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.



దుద్యాల్: పాడి పశువు కళేబరం

హకీంపూర్‌లో పాడి పశువు

దుద్యాల్: విద్యుదాఘాతంతో ఓ పాడి పశువు మృతి చెందింది. ఈ సంఘటన మండల పరిధి హకీంపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దగనపురం రమేశ్‌కు చెందిన పాడి పశువు పొలంలో మేత మేస్తోంది. ఈ క్రమంలో అది మేతమేస్తూ.. పక్కన పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తు వైరు తగలడంతో కరెంట్‌షాక్‌కు గురై పశువు అక్కడికక్కడే మృతి చెందింది. పశువు విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని బాధిత రైతు విలపించాడు. జీవనాధారం కోల్పోయానని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

మొదటి ప్రయత్నంలోనే..



అక్షిత

మర్పల్లి: ఓ విద్యార్థిని తొలి ప్రయత్నంలోనే ఎంబీబీఎస్ సీటు సాధించింది. మండల కేంద్రానికి చెందిన పబ్బే చంద్రకళ, దివాకర్ దంపతులకు ఇద్దరు కూతుర్లు, ఓ కుమారుడు ఉన్నాడు. చిన్న కుమార్తె అక్షిత ప్రాథమిక విద్యాభ్యాసం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, ప్రాథమికోన్నత, ఉన్నత విద్య హిమాయత్‌నగర్, ఇంటర్ శ్రీచైతన్య కళాశాలలో పూర్తిచేసింది. ఈ క్రమంలో నీట్ (ఎంబీబీఎస్)ప్రవేశ పరీక్షలో 720 మార్కులకు 520 మార్కులతో 185853 ర్యాంకు సాధించారు. దీంతో రెండో కౌన్సెలింగ్‌లో సంగారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించినట్లు తండ్రి తెలిపారు. తల్లి స్టాఫ్‌నర్సుగా, తండ్రి వ్యవసాయం చేస్తున్నారు.

పండుగపూట విషాదం

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

పెద్దేముల్: పండుగ పూట ఓ రైతు ఇంట్లో విషాదం నెలకొంది. ఈ సంఘటన పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధి గోపాల్‌పూర్ గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్దకుర్వ బాలప్ప(45), అడవి పందుల బెడదతో తన మొక్కజొన్న పంట కాపాలాకు వెళ్లాడు. రోడ్డు పక్కనే పొలం ఉండటంతో రోడ్డుకు పక్కనే నిద్రించాడు. ఈ క్రమంలో అదే రోజు రాత్రి 12.30 గంటల ప్రాంతంలో రోడ్డు పక్కనే వ్యక్తి పడుకున్నది గమనించని గుర్తు తెలియని వాహన దారుడు.. సదరు రైతును ఢీకొట్టడంతో బాలప్ప తీవ్రంగా గాయపడినట్లు గ్రామస్తులు తెలిపారు. చికిత్స నిమిత్తం కుటుంబీకులు తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాలప్ప మృతి చెందాడు. మృతుడి భార్య బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి.. ఆస్పత్రిలో కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కారు, ద్విచక్రవాహనం ఢీ

ఒకరి మృతి

బొంరాస్‌పేట: ద్విచక్ర వాహనం, కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధి జాతీయ రహదారి 163పై మెట్లకుంట చెక్‌పోస్టు వద్ద ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. చింతలదిండికి చెందిన ఎరుకలి మొగులయ్య(34) తన బైక్‌పై హైదరాబాద్ నుంచి సొంతూరుకు వెళ్తుండగా.. కొడంగల్ నుంచి పరిగి వెళ్తున్న ఫార్చునర్ కారు బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహన దారుడు మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. ఢీకొట్టిన కారు శంకర్‌పల్లి జెడ్పీటీసీ మాజీ సభ్యుడికి చెందినదిగా అనుమానిస్తున్నారు. మృతుడి తండ్రి ఆశప్ప ఇచ్చిన ఫర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్ఐ ఎండీ. రవూఫ్ తెలిపారు.

ఆగిఉన్న కారును ఢీకొన్న ఆటో..



ప్రమాదానికి గురైన ఆటో



వెంకటయ్య మృతదేహం

ఒకరి మృతి, నలుగురికి గాయాలు

నందిగామ: ఆగిఉన్న కారును వెనకాల నుంచి వచ్చిన ఆటో ఢీ కొట్టిన ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురికి గాయాలైన ఘటన నందిగామ శివారులోని 44వ జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు డ్రైవర్ రవిబాబు మంచినీరు తాగేందుకు నందిగామ శివారులో రోడ్డు పక్కన కారును నిలిపాడు. అదే సమయంలో నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలానికి చెందిన వెంకటయ్య(45) అతడి భార్య రాధికతో పాటు మరో ముగ్గురు కుటుంబ సభ్యులు ఆటోలో హైదరాబాద్ వైపు వెళ్తు వెనకాల నుంచి కారును ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో వెంకటయ్య అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను శంషాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి పంపించారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సిఉంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు..



నాలాలో ద్యాన్, హరీశ్ మృతదేహాలు

ఇబ్రహీంపట్నం రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన ఆదిబట్ల పోలిస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఆదివారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను సీఐ రాఘవేందర్‌రెడ్డి వెల్లడించారు. ఆదిబట్ల టీసీఎస్‌నుంచి ద్విచక్ర వాహనంపై ద్యానిసింగ్, పెరుమల్ల హరీశ్, ప్రకాశ్ అనే ముగ్గురు వ్యక్తులు బొంగ్లూర్ ఔటర్ రింగ్ రోడ్డు నుంచి వస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఒకే వాహనంపై అతివేగంగా వచ్చి బొంగ్లూర్ సర్వీస్‌రోడ్డు సమీపంలోని శ్రీరామధర్మకాంట వద్ద నాలాలో పడిపోయారు. ఈ సంఘటనలో బిహార్‌కు చెందిన ద్యాన్ సింగ్ (40), పెరుమల్ల హరీశ్ (28) నిర్మల్ ఖానాపూర్‌కు చెందిన ఇద్దరు దుర్మరణం చెందారు. బెంగాల్‌కు చెందిన ప్రకాశ్ (30)కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతనిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఇద్దరి మృతదేహాలను ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారని పోలీసులు పేర్కొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

తల్లీబిడ్డ క్షేమం



శిశువును కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న వైద్య సిబ్బంది

కడ్తాల్: మండల కేంద్రంలో బిహార్ రాష్ట్రానికి చెందిన గుడియా ముకేశ్ దంపతులు కొంత కాలంగా నివాసం ఉంటున్నారు. శనివారం ఉదయం గుడియాకు పురిటి నొప్పులు అధికం కావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమంలో కుటుంబ సభ్యులు 108కి సమాచారం ఇచ్చారు. దీంతో అంబులెన్స్ కడ్తాల్‌కు చేరుకుని గుడియాను ఆస్పత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలో నొప్పులు అధికమవ్వడంతో సిబ్బంది అంబులెన్స్‌లోనే నార్మల్ కాన్పు చేశారు. దీంతో తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు, వైద్య సిబ్బంది పేర్కొన్నారు. అనంతరం వారిని చికిత్స నిమిత్తం కందుకూర్ ప్రాథమిక ఆస్పత్రికి తరలించారు.

నకిలీ నిత్యావసరాల దందా

ప్రముఖ కంపెనీల పేర్లతో ఉత్పత్తులు

- రెండు ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్ దాడులు
- భారీ స్థాయిలో నాసిరకం సరుకు స్వాధీనం

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ కంపెనీలు, బ్రాండ్ల పేర్లతో ఉన్న నకిలీ నిత్యావసర వస్తువుల్ని విక్రయిస్తున్న మూడు దుకాణాలపై మధ్య మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. ఈ నేపథ్యంలో ముగ్గురు వ్యాపారులను పట్టుకోవడంతో పాటు భారీగా నకిలీ, నాసిరకం ఉత్పత్తులు స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ వైవీఎస్ సుధీంద్ర ఆదివారం వెల్లడించారు. రాజస్థాన్ నుంచి వచ్చి గోషామహల్‌లో స్థిరపడిన రమేష్ కుమార్ పర్మర్ బేగంబజార్‌లో ఆర్ఎం జనరల్ స్టోర్ పేరుతో, హితేష్ పర్మర్ ఫీల్‌ఖానాలో సరోజ్ ఏజెన్సీ పేరుతో, ఎర్రగడ్డలో స్థిరపడిన రమేష్ కుమార్ శ్రీ ట్రేడర్స్ పేరుతో నిత్యావసర వస్తువుల విక్రయ వ్యాపారం చేస్తున్నారు. ఇందులో ఆశించిన లాభాలు లేకపోవడంతో తక్కువ కాలంలో భారీ లాభాలు పొందడానికి మార్గాలు అన్వేషించారు. ఇందులో భాగంగా ప్రముఖ కంపెనీల పేరుతో నకిలీ వస్తువులు తయారు చేసి విక్రయించే ఏజెంట్లను సంప్రదించారు. వారి నుంచి గుడ్‌నైట్ లిక్విడ్, గోల్డ్‌ఫ్లాష్ కాంబి ప్యాక్, లైజాల్ లిక్విడ్, ఫెవీ క్విక్ పేర్లు, ప్యాకింగ్‌తో ఉన్న నకిలీ ఉత్పత్తులు అతి తక్కువ రేటుకు ఖరీదు చేస్తున్నారు. వీటిని తమ దుకాణాల్లో ఉంచి అసలైనవే అని వినియోగదారులకు చెప్తూ హోల్‌సేల్, రిటైల్‌గా అమ్ముతున్నారు. ఈ బ్రాండ్లపై ఉన్న నమ్మకంతో కస్టమర్లు సైతం భారీగా కొనుగోలు చేస్తున్నారు. ఈ ముగ్గురి దందాపై మధ్య మండల టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ ఎస్.రామకృష్ణ నేతృత్వంలో ఎస్సై డి.శ్రీకాంత్ గౌడ్‌తో కూడిన బృందం మూడు ప్రాంతాల్లో దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకుంది. వీరి నుంచి 444 బాక్సుల గోల్డ్ ఫ్లాష్ కాంబి ప్యాక్, 94 బాక్సుల గుడ్ నైట్ లిక్విడ్, 702 లైజాల్ బాటిల్స్, 13440 ఫెవీక్విక్ సాచెట్స్ స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం ఈ ముగ్గురితో పాటు స్వాధీనం చేసుకున్న నకిలీ సరుకును బేగంబజార్ పోలీసులకు అప్పగించారు.

మద్యం మత్తులో మహిళ హల్‌చల్

ఫిలింనగర్: మద్యం మత్తులో ఓ మహిళ (44) పార్కు పక్కన తూలిపోతూ..రోడ్డు పక్కన పడుకుని న్యూసెన్స్ చేస్తుండగా సమాచారం అందుకున్న ఫిలింనగర్ పోలీసులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని సయ్యద్‌నగర్ బస్తీలో నివసించే ఓ మహిళ గత కొంతకాలంగా మద్యానికి బానిసై అర్ధరాత్రి దాకా రోడ్లపై తిరుగుతూ న్యూసెన్స్ క్రియేట్ చేస్తుంది. శుక్రవారం రాత్రి 12.30 గంటల ప్రాంతంలో బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని ఎన్‌బీటీనగర్ ప్రాంతంలో మద్యం మత్తులో న్యూసెన్స్ చేస్తుండగా బంజారాహిల్స్ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే వారు అక్కడకు వెళ్లి ఆమె ఇంట్లో అప్పగించి వచ్చారు. అయితే ఇంట్లో చెప్పకుండానే ఆమె మళ్లీ అదే అర్ధరాత్రి 2.30 గంటల ప్రాంతంలో బయటకు వచ్చింది. ఎమ్మెల్యే కాలనీ సమీపంలోని లోటస్‌పాండ్ పార్కు వద్ద వివస్త్రగా పడి ఉంది. శనివారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఫిలింనగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆమె గురించి ఆరా తీయగా సయ్యద్‌నగర్‌లో నివసిస్తుందని తెలిసింది. దీంతో ఆమె కూతురికి ఫోన్ చేయగా 'సార్..దయచేసి మా అమ్మను ఇంటికి పంపకండి..జైలుకు పంపండి..' అంటూ ఆమె ఇంట్లో చేసిన న్యూసెన్స్‌ను మొరపెట్టుకుంది. ఆమె భర్త పెయింటర్‌గా పనిచేస్తుంటాడని, ముగ్గురు పిల్లలు ఉన్నారని, మద్యానికి బానిసై నట్లుగా పోలీసుల దర్యాప్తులో తేలింది. గత నెల రోజుల నుంచి 10 మార్లు పోలీసులు ఆమెను ఇలా గే రోడ్లపై మద్యం మత్తులో తిరుగుతుండగా కు టుం బసభ్యులకు అప్పగించారు. ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్మీవేంకటేశ్వరస్వామికి చక్రతీర్థ సేవ

మండల కేంద్రంలోని శ్రీబాలాజీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో నవరాత్రి ఉత్సవాలు, దసరా రోజు స్వామి వారికి చక్రతీర్థసేవ (తెప్పోత్సవం)తో ముగిశాయి. ఈ సందర్భంగా చివరి రోజు గరుడవాహన సేవ, పండుగ రోజున చక్రతీర్థ సేవ తెప్పోత్సవం, రాత్రి అశ్వవాహన సేవలతో ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చివరి రోజు ఆలయ పుష్కరిణి వద్ద స్వామి వారికి చక్రతీర్థ సేవలతో ఊరేగించారు. ఈ సేవను చూసేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. - చేవెళ్ల



చక్రతీర్థ సేవను చూసేందుకు వచ్చిన ప్రజలు



బాలాజీ లక్ష్మీవేంకటేశ్వరస్వామికి పుష్కరిణిలో పూజలు



పుష్కరిణిలో స్వామివారికి చక్రతీర్థ సేవ